సాక్షి
జనగామ
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023







## న్యూస్‌రీల్

### 89వ సారి రక్తదానం



జనగామ: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మల్లిగారి రాజు బుధవారం 89వ సారి రక్తదానం చేశాడు. జనగామకు చెందిన ఓ మహిళకు రక్తం అవసరమవడండతో సమాచారం అందుకున్న రాజు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాడు.

### సత్వర పరిష్కారం చూపాలి

నర్మెట: స్టేషన్‌కు వచ్చేవారికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని డీసీపీ సీతారాం అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించి సీఐ నాగబాబు, ఎస్సై అనిల్ కుమార్‌కు పలు సూచనలు చేశారు. గణేష్ నవరాత్రోత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు.

### ఓపీఎస్ అమలు చేయాలి

జనగామ: పాత పెన్షన్ విధానం అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖాజాషరీఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడ్ల రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు పీఆర్సీ, ఈహెచ్‌ఎస్ వెంటనే ప్రకటించి, పాత జీఓ ప్రకారం ప్రతి నెలా 31న వేతనాలు వచ్చేలా చూడాలన్నారు. జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగ బ్రహ్మచారి పాల్గొన్నారు.

### ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలి

జనగామ రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలని ఉద్యోగుల సంఘం నాయకుడు కేసోజు ఉమాపతి అన్నారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్షలు బుధవారం 17వ రోజు కొనసాగాయి. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాంబయ్య, స్వామి, విష్ణు, రవీందర్, దివ్య, వాణి, సిద్దులు, వసంత, పుష్పలత, సంధ్యారాణి, నిర్మల, కుసుమ రజిత పాల్గొన్నారు.


### ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

జనగామ రూరల్: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పాలాభిషేకం చేశారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ప్రేమలతారెడ్డి, సొడ రమేష్, కొంతం శ్రీనివాస్, శ్రీలత, మాలతి, నీరజ, అనురాధ, లక్ష్మి, పవన్ శర్మ, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

### రుషి పంచమి వేడుకలు

జనగామ: జిల్లా కేంద్రం హనుమకొండరోడ్డులోని శ్రీరాంనగర్ కాలనీ, మూలబావి వినాయక నవరాత్రి మండపం వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బుధవారం రుషి పంచమి వేడుకలు నిర్వహించారు. నగర అధ్యక్షుడు గునిగంటి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలనారాయణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, గునిగంటి రామకృష్ణ, వీహెచ్‌పీ సభ్యులు శ్రీనివాస్, గుజ్జుల కుమారస్వామి, నమిలె శంకర్, సీతారామచంద్రస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పద్మశాలీల బోనాలు



జనగామ: స్థానిక పద్మశాలీ కులస్తులు బుధవారం బోనాల పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కులస్తులు ప్రతి ఏటా ఆనవాయితీగా బోనాల జాతరను నిర్వహిస్తున్నారు. మహిళలు బోనాలతో వెళ్లి పోచమ్మతల్లికి మొక్కులు సమర్పించారు. పోపా నాయకులు మదాసు ఎల్లయ్య, పిట్టల సతీష్, చింతకింది హరి, డి.నవీన్, గద్దం రమేష్, ప్రభాకర్, బూరెల వెంకటేష్, పిట్టల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం విదేశీ విద్య ఉపకార వేతనాల గడువు పెంపు

జనగామ: ముఖ్యమంత్రి మైనార్టీలకు సంబంధించి విదేశీ విద్యా పథకంలో ఉపకార వేతనాలకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, కెనడా, లండన్, ఆస్ట్రేలియా, సింగపూర్, న్యూజిలాండ్ దేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదవడానికి ఉపకార వేతనం కోసం అర్హత కలిగిన మైనారిటీలు ఈనెల 22 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హార్డ్ కాపీలు, సర్టిఫికెట్లు కార్యాలయములో సమర్పించాలన్నారు.

# తేలిన టీఆర్టీ లెక్క

**మొత్తం పోస్టులు 76**
- అత్యధికంగా సోషల్ స్టడీస్‌లో 14
- మహిళా అభ్యర్థులకే అధికం
- నిరాశలో నిరుద్యోగ అభ్యర్థులు
- నూతన రోస్టర్ పాయింట్లు అమలు
- మొదటి సారిగా సీబీఆర్టీలో పరీక్షలు
- నవంబర్ 20 నుంచి 30 వరకు నిర్వహణ
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

**ఖాళీల వివరాలు**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గెజిటెడ్ హెచ్‌ఎంలు 49, పీఎస్‌హెచ్‌ఎం 58, ఎస్జీటీ 118, ఎస్‌ఏ పీడీ 5, పీఈటీ 7, ఎస్‌ఏ మాథ్స్ 20, ఫిజిక్స్ 8, బయోసైన్స్ 39, సోషల్ 53, ఇంగ్లిష్ 21, తెలుగు 14, హిందీ 7, ల్యాంగ్వేజ్ పండిట్ తెలుగు 12, ల్యాంగ్వేజ్ పండిట్ హిందీ 9, ఆర్ట్ 2, క్రాఫ్ట్ 2, ఒకేషనల్ 2 మొత్తం 426 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



**టీఆర్టీ ద్వారా భర్తీ చేసే పోస్టులు**

ఎస్‌ఏ 23, భాషా పండిట్ 17, వ్యాయామ 7, ఎస్జీటీ 29 మొత్తం 76 పోస్టులు కాగా.. సబ్జెక్టుల వారీగా.. స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ 2, పీడీ 1, సోషల్ స్టడీస్ 14, ఎస్‌ఏ తెలుగు 4, ఎస్‌ఏ హిందీ 2, ల్యాంగ్వేజ్ పండిట్ హిందీ 9, ల్యాంగ్వేజ్ పండిట్ తెలుగు 8, ఎస్జీజీ 29, పీఈటీ 7 ఉన్నాయి.

జనగామ రూరల్: ఏళ్ల తరబడి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే పోస్టుల భర్తీ వివరాలను వెల్లడించిన ప్రభుత్వం మంగళవారం సబ్జెక్టుల వారీగా ప్రకటించింది. బుధవారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం కాగా వచ్చే నెల 20 వరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగనుంది. జిల్లాలో మొత్తం పోస్టులు 76 ఉండగా అందులో అత్యధికంగా ఎస్‌ఏ సోషల్ స్టడీస్‌లో 14, అత్యల్పంగా పీడీ పోస్టు ఒకటి మాత్రమే ఉంది. గణితంలో పోస్టులే లేకుండా పోయాయి. దీంతో నిరుద్యోగుల ఆశలు అడియాశలయ్యాయి. 2018లో టీఎస్‌పీఎస్ ద్వారా టీఆర్టీ(టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) నిర్వహించిన ప్రభుత్వం నేరుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నియామకాలు చేపట్టింది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయనుంది. పరీక్షకు రెండు నెలల గడువు ఉండడంతో అభ్యర్థులు కోచింగ్‌లకు సిద్ధమవుతున్నారు. అయితే గతంలో పరీక్ష విధానం ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా ప్రస్తుతం సీబీఆర్టీలో నిర్వహించనున్నారు.



గ్రంథాలయంలో నిరుద్యోగ అభ్యర్థులు

**పోస్టుల సంఖ్య తక్కువ**

ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు నిరాశలో ఉన్నారు. గత ఐదేళ్ల నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఇప్పటికే 10వేల మందికిపైగా ఉన్నారు. ఈనెల 15న నిర్వహించిన టెట్ పరీక్ష ఫలితాలు ఈనెలలోనే వెలువడనున్నాయి. దీంతో సంఖ్య మరింత పెరిగి పోటీ అధికం కానుంది. జిల్లా వ్యాప్తంగా ఆయా సబ్జెక్టుల్లో కేవలం 76 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తుండడంతో పోటీ తీవ్రం కానుంది. జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఏ, ఎస్జీటీ తదితర పోస్టులు 426 ఖాళీ ఉండగా ప్రమోషన్ ద్వారా 215 భర్తీ కానుండగా మిగిలిన 211 పోస్టుల్లో 76 మాత్రమే భర్తీ చేయనుండడంతో అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే నూతన రోస్టర్ పాయింట్ల ప్రకారం పోస్టుల భర్తీ చేయనుండడంతో ఉన్న పోస్టుల్లో మహిళలకే సుమారు 40 వరకు దక్కే అవకాశం ఉంది.

**పోస్టుల సంఖ్య పెంచాలి**



ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2018 సంవత్సరం గణితంలో జీరో పోస్టులున్నాయి. ప్రస్తుతం అన్ని పోస్టులు కలిపి 76 మాత్రమే భర్తీ చేస్తున్నారు. అభ్యర్థులు వేలల్లో ఉన్నారు. ప్రస్తుతం గణితం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు లేవు. ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిన విధంగా 13వేల పోస్టులు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలి. పోస్టుల సంఖ్య పెంచాలి.

– గుగ్గిళ్ల రవికుమార్, డీఎస్సీ అభ్యర్థి ఖిలాషాపురం(రఘునాథపల్లి)

**ఎన్నికల జిమ్మిక్కులా కనిపిస్తున్నది**



అసెంబ్లీ సాక్షిగా 13 వేల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 5వేలకుపైగా పోస్టులు భర్తీ చేయడం సరికాదు. ఇది కేవలం ఎన్నికల జిమ్మిక్కులా కనిపిస్తున్నది. నిజానికి 20 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అలా చేస్తేనే విద్యాప్రమాణాలు పెరిగి అందరికీ విద్య అందుబాటులో ఉంటుంది. మెగా డీఎస్సీ వేయాలి.

– చంద్రశేఖర్‌రావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

## రుణమాఫీపై ఆందోళన వద్దు

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

చిల్పూరు: ప్రభుత్వం ఇచ్చే రుణమాఫీ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య లేకుండా చేస్తానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండల పరిధి శ్రీపతిపల్లికి చెందిన 40 మంది రైతులు బుధవారం హనుమకొండలోని నివాసంలో కడియంను కలిశారు. మల్కాపూర్ ఇండియన్ బ్యాంకు అధికారులు రుణమాఫీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని కడియం దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ అధైర్యపడొద్దని, కలెక్టర్‌తో మాట్లాడి అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చూస్తానని హామీ ఇచ్చారు. శ్రీహరిని కలిసిన వారిలో కొయ్యడ రాందాసుగౌడ్, రంగు రమేష్, ఉడుత వెంకన్న, గొంగిడి కృష్ణమూర్తి, కర్ణాకర్‌రెడ్డి, రాజు, ఐలయ్య, శ్రీనివాస్, ఉపేందర్, రొడ్డ యాదగిరి, కనుకరాజు, నాగరాజు, గంగారపు రాజు, ఎడ్ల కర్ణాకర్, యాదగిరి, డీలరు మల్లయ్య తదితరులు ఉన్నారు.



కడియంను కలిసిన శ్రీపతిపల్లి గ్రామ రైతులు

## బహుజనుల బందూకు సర్వాయి పాపన్న

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

లింగాలఘణపురం: సర్దార్ సర్వాయి పాపన్న బహుజనుల బందూకుగా నిలిచాడని, ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని ఎమ్మెల్యే టి.రాజయ్య అన్నారు. నవాబుపేటలో గౌడ ఐక్య సాధన సమితి జిల్లా కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని బుధవారం ఆయన గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ జయరాజేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విగ్రహ దాత, రాష్ట్ర అధికార ప్రతినిధి పులి శివకుమార్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ, జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, ఎంపీటీసీ తీగల సిద్దు, సమన్వయ సమితి అధ్యక్షుడు బాలగోని బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

## ప్రజాసాహిత్యమే చైతన్యానికి నాంది

- 'తెరవే' రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య

జనగామ రూరల్: ప్రజలను చైతన్య పరచడంలో ప్రజా సాహిత్యం కీలకమని, జనగామ కవుల నుంచి సృజనాత్మకత రచనలు రావాలని తెలంగాణ రచయితల వేదిక(తెరవే) రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య అన్నారు. సభ్యుల ఏకాభిప్రాయంతో బుధవారం తెరవే జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చీటూరు నర్సింహులు, అధ్యక్షుడిగా మంచీనీళ్ల రాఘవులు, ఉపాధ్యక్షుడిగా బోట్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా గాదరి సుధాకర్, సహాయ కార్యదర్శిగా సురేష్, వెంకటేషం, సలహాదారులుగా జి.క్రిష్ణో, కోడెం కుమారస్వామి, సాధిక్ అలీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సమస్యలను ప్రతిబింబించే కవిత్వాలు రావాలని కోరారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ నాయకులు

## ఉపాధి కల్పన అభినందనీయం

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి: నిరుద్యోగులకు రాష్ట్రం నుంచి వివిధ కంపెనీల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం పాలకుర్తిలో నియోజకవర్గ పరిధి నిరుద్యోగులకు వివిధ కంపెనీలు జాబ్ మేళా నిర్వహించగా.. పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, రాయపర్తి, తొర్రూరు, పెద్దవంగర తదితర మండలాల నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగాల కల్పనకు ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో అందరికీ అవకాశం ఉంటుందని చెప్పారు. వరంగల్‌లో మెగా ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం ఉందన్నారు. అందులో భాగంగా సీఎం కేసీఆర్ చొరవతో ఇప్పటికే రాష్ట్రంలో 35 వేల ఉద్యోగాలు కల్పించారని, ఇంకా 90 వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నారని తెలిపారు. కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి ఉన్న వివిధ కంపెనీలు గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు వివిధ దశల్లో ఉద్యోగాలు కల్పించడం సరైనదని అన్నారు. చదువుకున్న నిరుద్యోగులకు కంపెనీల ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదేవి మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



నియామక పత్రాలు అందుకున్నవారితో మంత్రి

**2,434 మంది ఎంపిక**

జాబ్ మేళాకు నాలుగువేల మంది నిరుద్యోగులు హాజరుకాగా.. 80 కంపెనీలు ఇంటర్వ్యూ చేశాయి. ఇందులో 2,434 మంది నిరుద్యోగులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి మంత్రి దయాకర్‌రావు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, సుహాసిని, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ రామ్మూర్తి, ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, పసునూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: జిల్లాలో గణేష్ మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్ కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.. విద్యుత్ వినియోగం విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండపాల వద్ద మెయిన్ లైన్‌కు కొక్కాలు తగిలించొద్దని, అనుమతి తీసుకున్న మండప నిర్వాహకులు సర్వీసు వైర్‌ను స్తంభానికి బిగించి ఇన్సులేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. లైట్లు వెలిగించడంతో పాటు సెల్‌ఫోన్లు చార్జింగ్ చేసుకునే సమయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. నిమజ్జనం రోజు ఊరేగింపు సందర్భంగా విద్యుత్ వైర్ల ఎత్తును సరిచూసుకుని వెళ్లాలన్నారు.

## అర్హులకు రుణమాఫీ అందేలా చూడాలి

- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

జనగామ: అర్హులైన రైతులందరికీ తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న రుణమాఫీ అందేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రుణమాఫీ, జీఓ 58, 59, గృహలక్ష్మి, ఆసరా పింఛన్, నివాస స్థలాల పట్టాల పంపిణీ, జీపీ కార్యాలయ భవన నిర్మాణాలు, హరితహారం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి కలెక్టర్ శివలింగయ్య వివరిస్తూ.. రూ.లక్ష లోపు రుణమాఫీ అర్హుల ఖాతాల్లో జమయ్యాయని, ఖాతా వివరాలు సరిగాలేని రైతుల నుంచి సేకరించి పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న అర్హులకు జీఓ 58, 59 ద్వారా అవకాశం కల్పించామన్నారు. ఇంటి నివాస స్థలం కలిగిన అర్హులకు గృహలక్ష్మి పథకం అందేలా చూస్తున్నామని, ఆసరా పెన్షన్ పొందుతూ మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యుల్లో ఒకరికి అవకాశం కల్పించడానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వీసీలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ సుహాసిని, డీపీఓ వినోద్‌కుమార్, పీఆర్ ఈఈ చంద్రశేఖర్, హౌసింగ్ ఈఈ దామోదర్, ఉద్యానవన శాఖ అధికారి కేఆర్.లత, ఎల్‌డీఎం శ్రీధర్ తదితురులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

**నిబంధనల మేరకు ఫిల్లింగ్ స్టేషన్లు నిర్వహించాలి : కలెక్టర్**

జనగామ రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఫిల్లింగ్ స్టేషన్లు నిర్వహించాలి.. లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ శివలింగయ్య హెచ్చరించారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని పాలకుర్తి, చెన్నూరు, జనగామ, పెంబర్తి కామారెడ్డిగూడెం తదితర పెట్రోల్ పంపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిల్లింగ్ స్టేషన్లలో తాగు నీరు, టాయిలెట్లు, ఫైర్ సేఫ్టీ, సేల్స్ తదితర సౌకర్యాలు ఉండాలని చెప్పారు. కల్తీ లేకుండా పెట్రోల్, డీజిల్ విక్రయించాలన్నారు. తనిఖీల్లో డీఎస్‌ఓ రోజారాణి, లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీనివాస్, ఐఓసీ సేల్స్ అధికారి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

జనగామ: పట్టణంలోని హన్మకొండరోడ్డు గురుద్వార్ సమీపాన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు బీటెక్ విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన కె.ప్రశాంత్, గానుగుపహాడ్‌కు చెందిన బి.రవిచందర్, పట్టణంలోని నెహ్రూపార్కు ఏరియాకు చెందిన జి.ఓంసాయి స్నేహితులు. వీరు యశ్వంతాపూర్ సీజేఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నారు. కళాశాల ముగిసిన తర్వాత ముగ్గురు స్కూటీపై జనగామకు బయలు దేరారు. గురుద్వార్ యూటర్న్ వద్ద ఓ ట్రాక్టర్ వెళ్లే క్రమంలో స్కూటీకి వెనక డబ్బా తగలడంతో వారు కింద పడిపోయారు. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఓంసాయి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు రెఫర్ చేశారు. మిగతా ఇద్దరికి ఇక్కడే చికిత్స అందిస్తున్నారు.





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్, రవిచందర్

# ఈసారీ వరినే!

**8,64,917 ఎకరాల్లో వరి... అంచనాకు 22శాతం అధికం**
- ఉమ్మడి వరంగల్‌లో సాగు లక్ష్యం 14,82,605 ఎకరాలు
- 15,01,608 ఎకరాల్లో వివిధ పంటలు వేసిన రైతులు
- తెల్ల బంగారంపై తగ్గిన మోజు.. లక్ష ఎకరాల్లో తగ్గిన అంచనా
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు ఈ వానాకాలంలోనూ వరిసాగుపైనే మక్కువ చూపారు. అంచనాలకు మించి 22శాతం అదనపు విస్తీర్ణం పెరిగింది. గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి సాగుపై అనాసక్తి కనబరిచారు. అంచనాలకంటే 15.59 శాతం తక్కువ సాగయ్యింది. ఇదే సమయంలో చిరుధాన్యాల సాగులోను వృద్ధి కనిపించలేదు. పంటమార్పిడిపై వ్యవసాయ శాఖ విస్తృతంగా ప్రచారం చేపట్టడంతోపాటు ఆయిల్‌పామ్‌వైపు మళ్లించే ప్రయత్నం చేసినా.. ఈసారీ వరిసాగుపైనే రైతులు మొగ్గు చూపారు.

**లక్ష్యాన్ని మించిన వానాకాలం సాగు..**

వ్యవసాయశాఖ ఈ వానాకాలంలో 14,82,605 ఎకరాల సాగు అంచనా వేసింది. జులైలో పరిస్థితులు కొంత ప్రతికూలంగా ఉన్నా.. ఆ తర్వాత సాగు పుంజుకుంది. వ్యవసాయ శాఖ అంచనాలను మించి 15,01,608 (101.28 శాతం) ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. వరి 7,07,757 ఎకరాలు అంచనా కాగా 8,64,917 ఎకరాల్లో (122.20 శాతం) సాగైంది. పత్తి 6,37,759 ఎకరాల అంచనా కాగా.. 5,38,325 ఎకరాల్లో (84.41 శాతం) సాగు చేశారు. మొక్కజొన్న పంటలు కూడా 65,012 ఎకరాల్లో సాగు చేసిన రైతులు అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 35,032 ఎకరాల అంచనాకు గాను 50,211 ఎకరాల్లో వేశారు.



దేవరుప్పల మండలంలో సాగైన వరి, పత్తి పంటలు

**పెరుగుతున్న విస్తీర్ణం..**

ఉమ్మడి వరంగల్ పరిధిలో ఎస్సారెస్పీ – 1, 2, దేవాదుల, కాళేశ్వరం ప్రాజెక్టులు, రామప్ప, పాకాల, లక్నవరంలతో పాటు సుమారు 1,298 చెరువుల్లో పుష్కలంగా నీరుండడం... 67 వరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం.. 10 మీటర్ల నుంచి 12 మీటర్లకు పడిపోయిన నీటిమట్టం 4.50 – 6 మీటర్లకు పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. వరుణుడు కరుణించడంతో పెరిగిన భూగర్భజలాలు, ఉచిత కరెంటు సరఫరాతో బోర్ల కింద పంటలు సైతం సాగవుతున్నాయి. గతేడాది 12.31 లక్షల ఎకరాలు సాగు కాగా.. వ్యవసాయ అధికారులు ఈ వానాకాలంలో అంచనాకు మించి 15,01,608 ఎకరాల్లో పంటలు వేశారు.




ఉధృతంగా పారుతున్న ఎస్సారెస్పీ కాలువ

**పంటల సాగు విస్తీర్ణంపై పకడ్బందీ నివేదిక**

వానాకాలం పంటల సాగుపై పకడ్బందీగా నివేదికలు తయారీకి చర్యలు చేపట్టాం. రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి వివరాలు ఏఈఓలు నమోదు చేశారు. క్షేత్రస్థాయికి వెళ్లి సాగు చేసే ప్రతి పంటనూ నమోదు చేశాం. పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రైతులు వరి, పత్తి పంటలపై దృష్టి పెట్టారు. పంటల దిగుబడికి అనుగుణంగా కొనుగోళ్లపైనా ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు చేపడుతాం.

– కేతిరి దామోదర్ రెడ్డి, ఏడీఏ, హనుమకొండ




వరి, పత్తి సాగు వివరాలు... (ఎకరాల్లో)

| జిల్లా | వరి | | పత్తి | |
|---|---|---|---|---|
| | అంచనా | సాగైంది | అంచనా | సాగైంది |
| హనుమకొండ | 1,12,396 | 1,41,600 | 1,08,944 | 80,777 |
| వరంగల్ | 1,06,749 | 1,29,377 | 1,30,908 | 1,22,476 |
| జేఎస్ భూపాలపల్లి | 93,298 | 1,06,360 | 1,14,891 | 96,035 |
| ములుగు | 98,861 | 63,540 | 27,148 | 23,022 |
| జనగామ | 1,37,045 | 2,13,761 | 1,61,675 | 1,39,145 |
| మహబూబాబాద్ | 1,59,408 | 2,10,279 | 94,193 | 76,870 |

## మేడారం జాతరకు సన్నద్ధం కావాలి

● ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్



సీపీ రంగనాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్

హన్మకొండ : మేడారం జాతరకు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు సన్నద్ధం కావాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో కరీంనగర్ జోన్ పరిధిలోని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఆర్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో జరిగే మేడారం మహాజాతర పనులు ప్రారంభించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. అదే విధంగా దసరా సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. అధికారులు, ఉద్యోగులు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతూ సంస్థను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో వరంగల్ ఆర్‌ఎం శ్రీలత, ఆయా జిల్లాల ఆర్‌ఎంలు సుచరిత, సాల్మన్, జాన్‌రెడ్డి, వెంకన్న, డిప్యూటీ మేనేజర్లు భాను కిరణ్, మాధవరావు, ఈఈ భాస్కర్, డిపో మేనేజర్లు వెంకటేశ్వర్లు, సురేష్, ధరమ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## 24న డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ఎన్నికలు

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర స్థాయి డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌లోని సుప్రభాత్ గ్రాండ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కమిటీ బాధ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఐదు సంవత్సరాల ఫిడే ఐడీ కలిగి, 25 సంవత్సరాల వయసు కలిగిన వారు ఎన్నికల్లో వివిధ పదవుల కోసం పోటీ చేయొచ్చని తెలిపారు. రెండేళ్ల ఫిడే ఐడీ, 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని కమిటీ సభ్యులు అమిత్‌పాల్, దయాభేతి, రాజశేఖర్‌రెడ్డి, సమీర్‌కుమార్, కంది రవి, బొల్లం సంపత్ తెలిపారు. మిగతా వివరాలకు 86868 62425లో నంబర్ సంప్రదించాలని వారు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కురవి: ఉపాధి హామీ కూలీ ఇవ్వాలని ఓ మహిళ.. తరుచూ వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్)లో జరిగింది. కురవి ఎస్సై గోపి కథనం ప్రకారం గ్రామానికి చెందిన గాండ్ల నరేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన మహబూబీ.. ఉపాధి హామీ కూలీ ఇవ్వాలని నరేష్‌ను తరచూ దుర్భాషలాడుతోంది. దీనికి మనస్తాపానికి గురైన నరేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన నరేష్‌ను వెంటనే మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై నరేష్ భార్య అఖిల ఫిర్యాదు మేరకు మహబూబీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గోపి తెలిపారు.




# ‘హరిత’.. అంతేనా?

**మేడారంలో మూతబడిన హోటల్**

- గత జూలైలో వరదలో మునక
- పాడైన వస్తువులు, ఫర్నిచర్
- మరమ్మతు విషయంలో నిర్లక్ష్యం



మూసివేసిన హరిత హోటల్

ఎస్‌ఎస్ తాడ్వాయి: ఆదివాసీ దైవాలు సమ్మక్క, సారక్క జాతరకు వచ్చే భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం మేడారంలో ఆధునిక హంగులతో హరిత హోటల్ ఏర్పాటు చేశారు. జాతర సమయంలో వీవీఐపీలు, ఉన్నతాధికారులు ఈ హోటల్‌ను వినియోగించుకుంటారు. అయితే జాతర అనంతరం ఈ హోటల్‌ను భక్తులకు కేటాయించిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్‌లో కూడా ఈ హోటల్‌కు సంబంధించిన వివరాలు కనిపించేవి కావు. దీంతో ముందుస్తుగా హరిత హోటల్‌లో గదులు బుక్ చేసుకోవడం సాధ్యం కాకపోయేది. ఫలితంగా ఈ హోటల్ నిర్మాణం పూర్తి చేసుకుని రెండేళ్లు దాటినా సామాన్యులకు పెద్దగా ఉపయోగపడింది లేదు. అయితే రెండు సంవత్సరాల క్రితం హోటల్ మెయింటనెన్స్‌ను ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చారు. దీంతో చక్కని వసతి దొరికిందని భావించిన భక్తుల ఆశలు నిరాశలయ్యాయి. గత జూలై చివరి వారంలో కురిసిన భారీ వర్షాలకు జంపన్న వాగు వరదతో హరిత హోటల్ పూర్తి మునిగింది. దీంతో కుర్చీలు, టేబుళ్లు, బెడ్లు, పరుపులు, దుప్పట్లు, దిండ్లు ఇలా ఫర్నిచర్ మొత్తం పాడైంది.

**రూ. 50 లక్షలు వెచ్చిస్తే..**

జంపన్నవాగు వరదకు హోటల్ మునిగి అందులోని దుప్పట్లు, పరుపులు పాడయ్యాయి. దీంతో కొత్తవి కొనాల్సిన అవసరం ఉంది. అదే విధంగా బెడ్లు, కుర్చీలు, టేబుళ్లు, కిచెన్ ఐటమ్స్‌కు కూడా మునిగాయి. అయితే ఈ ఐటమ్స్‌కు మరమ్మతులు చేస్తే ఉపయోగించుకునే వీలుంది. మొత్తంగా హరిత హోటల్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలంటే రూ.50 లక్షల వరకు అవసరమని సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. అయితే ప్రస్తుతం హరిత హోటల్‌ను ప్రైవేట్ వ్యక్తులు లీజ్ తీసుకున్నారు. దీంతో మరమ్మతులు చేయించాలనే అంశంపై స్పష్టత కరువైంది. ఫలితంగా వరద ముగిసి రెండు నెలలు పూర్తి కావొస్తున్న పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రస్తుతం హరిత హోటల్ మూతబడింది. మరికొన్నాళ్లు ఇదే తీరు ఉంటే మరమ్మతుల ఖర్చు తడిసిమోపుడు అవుతుంది. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

**మంత్రులు దృష్టి సారిస్తే..**

2024 ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క, సారలమ్మ మహాజాతర సందర్భంగా మేడారంలో వీవీఐపీలకు గెస్ట్‌హౌస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు మంత్రులు గురువారం మేడారం వస్తున్నారు. ఈ సందర్భంగా జాతర అభివృద్ధి పనులతో పాటు హరిత మరమ్మతులపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

## తెలంగాణలో మహిళలకు మహర్దశ

- రూ.5.17 కోట్లతో పాలకుర్తి నియోజకవర్గంలో కుట్టు శిక్షణ
- నంగెం టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి అవకాశాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సీఎం కేసీఆర్‌తోనే మహిళలకు మహర్దశ కలుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శ్రీనిధి, మెప్మా ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం డివిజన్ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో ఉచిత కుట్టు మిషన్లు అందజేశారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్‌రావుతో కలిసి తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల మహిళలకు 810 కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆడబిడ్డలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి వారిని రాజకీయాల్లో భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రూ.5.17 కోట్లు వెచ్చించి పాలకుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కుట్టు శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. ఒక్కో మహిళపై రూ.17 వేలు వెచ్చిస్తున్నామన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా మిషన్లు, సర్టిఫికెట్లు అందిస్తున్నామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నంగెం టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 25న తొర్రూరులో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, జినుగు అనిమిరెడ్డి, ఈదురు రాజేశ్వరి, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఏపీఎంలు ఎస్. ఉపేందర్, ఆర్. కిరణ్‌కుమార్, నరేంద్రకుమార్, ఎర్రబెల్లి ట్రస్ట్ కోఆర్డినేటర్ పంజా కల్పన తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు



కాజీపేట రూరల్: మూడో రైల్వే లైన్ నిర్మాణం కారణంగా కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే దానాపూర్, గోరఖ్‌పూర్ రైళ్ల సర్వీస్‌లను దారి మళ్లించినట్లు స్థానిక రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. సికింద్రాబాద్–దానాపూర్ (12791) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు, దానాపూర్–సికింద్రాబాద్ (12792) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు వయా సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించామన్నారు. అదేవిధంగా ఈ నెల 22వ తేదీన హైదరాబాద్–గోరఖ్‌పూర్ (02575) ఎక్స్‌ప్రెస్‌ను వయా సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా దారి మళ్లించామన్నారు. ఈ దారి మళ్లింపును ప్రయాణికులు గమనించి సహకరించాలని వారు కోరారు.

## రైలు ప్రమాదంలో ఉద్యోగి మృతి




రాజు (ఫైల్)

జనగామ: ఖమ్మం జిల్లా మధిర ఎల్‌ఐసీ ఆఫీస్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జనగామ జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి బుధవారం మృతి చెందారు. జనగామ పట్టణం హెడ్ పోస్టాఫీస్ ఏరియాకు చెందిన యాసోజు విద్యాసాగర్, మంజులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. విద్యాసాగర్ ఎల్‌ఐసీలో ఉద్యోగం చేస్తూ కొంతకాలం క్రితం మృతి చెందారు. దీంతో తండ్రి ఉద్యోగం కుమారుడు రాజు(21)కు వచ్చింది. రెండేళ్ల క్రితం మధిర ఎల్‌ఐసీలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. ఇటీవల తల్లి, చెల్లితో కలిసి హనుమకొండ అదాలత్ ఏరియాలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో మధిర నుంచి హనుమకొండకు బయలుదేరిన రాజు.. రైల్వే ట్రాక్ దాటే క్రమంలో రైలు ఢీకొంది. దీంతో రాజు మృతి చెందారని మృతుడి బాబాయ్ నాగరాజు తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు.

## డెంగీతో చిన్నారి విలవిల ..

- హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స
- రోజు వైద్య ఖర్చు రూ.2 లక్షలు
- ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు



చికిత్స పొందుతున్న చిన్నారి

గార్ల : ఓ పసి హృదయం విష జ్వరంతో విలవిలాడుతోంది. పట్టుమని పది నెలలు కూడా నిండని ఆ శిశువును డెంగీ మహమ్మారి ఆవహించింది. వాంతులు, విరోచనాలతో చుట్టుముట్టింది. దీనికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. చిన్నారిని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఎక్కడా తగ్గలేదు. వైద్యుల సూచన మేరకు చివరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ రోజుకు రూ. 2 లక్షలు ఖర్చు చేస్తూ చిన్నారిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై దాతలు స్పందించి ఆర్థిక చేయూతనందించాలని వారు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ముల్కనూరు గ్రామ పంచాయతీ పరిధి దుబ్బగూడెం గ్రామానికి చెందిన చిన్నారి తోటకూర బాలకృష్ణ, లలిత దంపతుల 9 నెలల పాప ప్రణీద ఉంది. ఈ క్రమంలో ప్రణితకు ఈనెల 13న జ్వరం రావడంతో బయ్యారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అక్కడ జ్వరం తగ్గకపోవడంతో 14వ తేదీన ఖమ్మంలోని జూబిల్లి ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఖమ్మంలో కూడా జ్వరం తగ్గకపోగా, వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో అక్కడి వైద్యులు ఈనెల 17న హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రికి రెఫర్ చేయగా చిన్నారిని అక్కడికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పాప ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే వైద్యఖర్చుల రోజుకు రూ.2 లక్షలు అవుతుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీనిపై దాతలు స్పందించి 9949803665 నంబర్‌కు ఫోన్ పే చేసి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు. కాగా, దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు ముల్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం దుబ్బగూడెంలో వైద్యశిబిరం నిర్వహించారు.

## ట్రాక్టర్ కింద పడి యువకుడి మృతి



రవికుమార్ మృతదేహం

రాయపర్తి: క్వారీలో డ్రిల్లింగ్ చేసే ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని గన్నారం వీరవైష్ణవి గ్రానైట్ క్వారీలో జరిగింది. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం బిహార్‌కు చెందిన రవికుమార్‌యాదవ్(19) గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ జాకీ లేబర్‌గా పని చేస్తున్నాడు. కంప్రెషన్ జాకీ ట్రాక్టర్‌ను నడుపుతున్న క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రవికుమార్ యాదవ్ ట్రాక్టర్ కింద పడి తీవ్రగాయాలకు గురికావడంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి రవికుమార్ యాదవ్ అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.ఈ ఘటనపై మహారాష్ట్రకు చెందిన అదే క్వారీలో పని చేస్తున్న బ్రజేష్‌యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతున్న యువకుడు..



సురేష్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం రోటిబండ తండా గ్రామంలో జరిగింది. రూరల్ ఎస్సై బీ.రాంచరణ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బానోత్ సురేష్ (25)కు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. అయితే కొంతకాలంగా సురేష్, అతడి భార్య సరితకు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సురేష్ ఈ నెల 18వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన తండావాసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి సోదరుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గొంతు కోసుకున్న సైకో.. ఆస్పత్రికి తరలింపు

కాజీపేట: కాజీపేట పట్టణంలో ఓ సైకో గొంతు కోసుకుని వీరంగం సృష్టించాడు. బిహార్‌కు చెందిన అమర్ చౌహాన్ ( 30) మిత్రులతో కలిసి బుధవారం రైలులో కాజీపేట జంక్షన్ చేరుకున్నాడు. అనంతరం సహచరులతో కలిసి గంజాయి సేవించి వారితోనే గొడవకు దిగాడు. జేబులో ఉన్న కత్తితో గొంతుకోసుకోవడంతో దుస్తులన్నీ రక్తసిక్తమయ్యాయి. హిందీలో బాటసారులను దూషిస్తూ దౌర్జన్యంగా ప్రవర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం 108లో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

# చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

**ట్రాన్స్‌జెండర్లు ఓటు నమోదు చేసుకునేలా చూస్తా..**

- ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఉపయోగించుకుంటాం
- ‘సాక్షి’తో రాష్ట్ర ఎన్నికల ప్రచారకర్త, ట్రాన్స్‌జెండర్ లైలా



సాక్షితో మాట్లాడుతున్న లైలా..

ఇంటర్వ్యూ

సాక్షి, వరంగల్: ‘చట్టసభల్లో రిజర్వేషన్‌తో అవకాశం కల్పిస్తే మేము రాజకీయంగా నిరూపించుకుంటూ.. సమాజానికి సేవ చేస్తాం’ అంటున్నారు.. రాష్ట్ర ఎన్నికల ప్రచారకర్త, ట్రాన్స్‌జెండర్ లైలా. తొలిసారిగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రచారకర్తగా ట్రాన్స్‌జెండర్ లైలా ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3,600 మందికిపైగా ఉన్న ట్రాన్స్‌జెండర్లకు లైలా నాయకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ట్రాన్స్ జెండర్ సంక్షేమ బోర్డు సభ్యురాలిగా కూడా ఉన్న లైలాతో ‘సాక్షి’ బుధవారం ముచ్చటించింది. వివరాలు ఆమె మాటల్లోనే..

**బాధ్యతగా భావిస్తున్నా..**

గొప్ప గొప్ప సెలబ్రిటీలు, హీరో హీరోయిన్లను ఎన్నికల ప్రచార కర్తలుగా తీసుకుంటున్న తరుణంలో ఓ ట్రాన్స్‌జెండర్ అయిన నన్ను ఓ ఐకాన్‌గా తీసుకోవడం అరుదైన అవకాశంగా.. గొప్ప బాధ్యతగా భావిస్తున్నా. ఇంత గుర్తింపునిచ్చిన ఎన్నికల కమిషన్‌కు ధన్యవాదాలు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పోరాటాలు చేసి చాలావరకు సాధించుకున్నాం.. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు కాస్త గుర్తింపు పెరిగింది. అధికారులు.. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల్లో ట్రాన్స్‌జెండర్స్‌పై అవగాహన పెరిగింది. కానీ, మార్పు రావాలంటే ప్రభుత్వాలు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి. అవకాశాలు ఇవ్వాలి. ప్రత్యేక గుర్తింపును ఇచ్చినప్పుడు మాత్రమే మరింత ముందుకెళ్లే.. అవకాశం ఉంటుంది. రిజర్వేషన్ల వల్లనే ఎక్కువ అవకాశాలు దొరుకుతాయి. విద్య, ఉద్యోగం, వైద్యం, రాజకీయ రంగాల్లో కూడా ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్ ఇచ్చి ప్రోత్సహించాలి..

**సంఖ్య పెరిగితే ప్రత్యేక పథకాలు..**

రాష్ట్రంలో ఉన్న మా కమ్యూనిటీ సమస్యలపై అవగాహన ఉంది. లక్ష వరకు మా సంఖ్య ఉన్నా.. ఓటరు జాబితాలో మాత్రం 2,033 మందే కనిపిస్తున్నారు. చాలామంది మేల్, ఫిమేల్‌గా నమోదు చేసుకున్నారు. అందుకే మా సంఖ్య తక్కువగా కనిపిస్తోంది. మా మీద ఉన్న వివక్షతో కొంత మంది ట్రాన్స్‌జెండర్‌గా ఓటర్‌గా నమోదు చేసుకోవడం లేదు. గుర్తింపు, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో బయటకు చెప్పుకునేందుకు ఇష్టపడడం లేదు. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కొంతమంది ధైర్యంగా ముందుకొచ్చి అదర్స్.. థర్డ్ జెండర్.. అనే కాలమ్‌లో ఓటరుగా నమోదు చేసుకున్నారు. మేమంతా 18 ఏళ్లు నిండిన వాళ్లమే. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా నా వంతు పాత్ర నిర్వర్తిస్తా. అప్పుడే ప్రభుత్వాలు మాకు ప్రత్యేక పథకాలు తీసుకొచ్చే అవకాశం ఉంటుంది.

**అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా..**

అవకాశం ఇస్తే ఎమ్మెల్యేగా నిరూపించుకుంటాం.. అవకాశం ఏ రాజకీయ పార్టీ ఇచ్చినా.. చట్టసభల్లో ఉండాలని కోరుకుంటాం. మాకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి. ఎందుకంటే చట్టసభల్లో మాత్రమే మన పాలసీలు, జీఓలు వస్తుంటాయి. ఎక్కడైతే పాలసీలు తయారవుతున్నాయో అక్కడ మా వాయిస్ ఉండాలని కోరుకుంటాం. కాబట్టి ఏ రాజకీయ పార్టీ అవకాశం ఇచ్చినా.. మా కమ్యూనిటీ ఉపయోగించుకుంటుంది. మాకు అది అవసరం కూడా.. అదే సమయంలో ఎన్నికల ప్రచార కర్తగా ప్రతి ఒక్క అర్హులు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తా.. ఓటును వినియోగించడం ద్వారా సరైన సేవ చేసే వ్యక్తిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని విడమరిచి చెబుతా. ఓటు గొప్ప ఆయుధం కాబట్టి ఓట్లు వేసే రోజు పోలింగ్ బూత్ కు వెళ్లాలి. అప్పుడే సరైన ప్రజాస్వామ్యాన్ని, నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. సరైన నా యకుడు వస్తేనే మన జీవితాల్లో మార్పు వస్తుంది.

## అంతర్ రాష్ట్ర దొంగపై పీడీ యాక్టు



పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న సీఐ వేణు

వరంగల్ క్రైం/మడికొండ: అంతర్ రాష్ట్ర దొంగపై పీడీ యాక్టు నమోదు చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆ ఉత్తర్వులను దొంగతనం కేసులో అరెస్ట్ అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు చెందిన అంటగిరి రాజు అలియాస్ నాగరాజుకు బుధవారం చర్లపల్లి కారాగారంలో హనుమకొండ జిల్లా మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు అందజేశారు. పీడీ యాక్టు అందుకున్న నిందితుడు గత మార్చిలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడడంతో మడికొండ పోలీసులు గత నెల 10వ తేదీన అరెస్ట్ చేశారు. అతనినుంచి సుమారు రూ.7లక్షల విలువ చేసే 103 గ్రాముల బంగారం, 824 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.19వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

## పలకరింపులు.. ఆపై చోరీలు..

- కల్యాణ మండపాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



గౌరీశంకర్ అరెస్టు చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం: కల్యాణ మండపాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సీసీఎస్, కేయూసీ, సుబేదారి పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. రూ.2.10 లక్షలు విలువైన 20 గ్రాముల బంగారం, 58 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.13 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీల వివరాలను వెల్లడించారు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన గౌరీశంకర్ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతున్నాడు. వివాహ సమయాల్లో పరిచయస్తుడిగా అందరిని పలుకరిస్తూ వధువు, వరుడు గదుల్లో చోరీలకు పాల్పడ్డాడు. గత మార్చి 3న కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో, ఈనెల 3న సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్యాణ మండపాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో గౌరీశంకర్ ఈ నెల 20వ తేదీన కేయూసీ జంక్షన్‌లో అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. దీంతో అరెస్టు చేసి బంగారం, వెండి ఆభరణాలతోపాటు నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## పథకం ప్రకారమే మల్లేష్ హత్య..

- వివరాలు వెల్లడించిన మహదేవపూర్ సీఐ కిరణ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్, ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం : భూమి, వారసత్వ ఉద్యోగ విషయంలో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటనలో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహదేవపూర్ సీఐ కిరణ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరానికి చెందిన పట్టి రాములు వీఆర్‌ఏగా విధులు నిర్వర్తించేవారు. రాములు మృతి చెందిన తరువాత అతడి కుమార్తెకు రావాల్సిన ఉద్యోగాన్ని కోర్టు ద్వారా అతని సోదరుడు పట్టి మల్లేష్(56) దక్కించుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఇరుకుటుంబాల మధ్య వారసత్వ ఉద్యోగ విషయంతోపాటు భూమి విషయంలో తగాదాలు నెలకొన్నాయి. 15 సంవత్సరాల నుంచి రాములు అల్లుడు నార ఈశ్వర్, రాములు భార్య వెంకటమ్మతో మల్లేష్ కుటుంబానికి తరచూ పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో ఈనెల 18న స్థానిక చంద్రశేఖర్‌రెడ్డి కిరాణం వద్ద ఈశ్వర్ కూర్చుండగా.. మల్లేష్ బస్టాండ్ నుంచి తన ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మధ్య గొడవ జరగగా స్థానికులు వారిని నిలువరించి పంపించారు. తరువాత మల్లేష్ ఇంటికి వెళ్లి తన భార్య పోసక్క, కుమారుడు హరీష్‌ను తీసుకుని మళ్లీ ఈశ్వర్‌తో గొడవ పడ్డారు. ఈ క్రమంలో రాములు భార్య వెంకటమ్మ, ఈశ్వర్, ఓ బాలుడు పథకం ప్రకారం మల్లేష్, పోసక్క, హరీష్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అదే రోజు మల్లేష్ చికిత్స పొందుతూ మృతి చెందగా, అతని భార్య, కుమారుడు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు నార ఈశ్వర్, పట్టి వెంకటమ్మ, ఓ బాలుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్‌రావు, సిబ్బంది రాజేందర్, రమ, బాల్‌సింగ్, గౌస్, శ్యాం, ధనుంజయ్, అన్వేష్,రాజేందర్, జ్యోతి, తిరుపతి పాల్గొన్నారు.

## టీసీ చేయి చేసుకున్నాడని ప్రయాణికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

మహబూబాబాద్ రూరల్ : కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో విధుల్లో ఉన్న టికెట్ కలెక్టర్ (టీసీ) పరుష పదజాలంతో దూషిస్తూ ప్రయాణికుడిపై చేయిచేసుకున్నాడని, ఆ టీసీపై చర్యలు తీసుకోవాలంటూ మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం ప్రయాణికులు ఆందోళన నిర్వహించారు. వరంగల్ నుంచి మహబూబాబాద్ వైపు వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులు జనరల్ బోగీల్లో కాకుండా రిజర్వేషన్ బోగీల్లో ఎక్కారని టికెట్ కలెక్టర్ వారిపట్ల అమర్యాదగా ప్రవర్తించి, దుర్భాషలాడి చేయిచేసుకున్నాడని వాపోయారు. సదరు రైలులో జనరల్ బోగీలు తక్కువగా ఉండటంతో తాము రిజర్వేషన్ బోగీలో ఎక్కామని, అకారణంగా తమపై టీసీ చేయి చేసుకున్నట్లు తెలిపారు. మహిళలని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని తెలిపారు. ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయాణికులకు సర్దిచెప్పారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి టీసీపై చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ప్రయాణికులు ఆందోళన విరమించారు.